క్లుప్తంగా

వైభవంగా యంత్ర ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న రమణానంద మహర్షి

భువనగిరి రూరల్: మండలంలోని నాగిరెడ్డిపల్లి రమణేశ్వరంలో జరుగుతున్న దశ మహా బైరవుల ప్రతిష్ఠ ఉత్సవాల్లో భాగంగా సోమవారం సిద్ధగురువు రమణానంద మహర్షి చేతుల మీదుగా 36 విశేష ద్రవ్యాలతో యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉడికించిన కొబ్బరి, గుమ్మడి కాయలంలో బలి కార్యక్రమం జరిపారు. సాయంత్రం శివలింగ విగ్రహ ప్రతిష్ఠలు జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా

ఆలేరు రూరల్: తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర కన్వీనర్ చింతల సాయిబాబా సోమవారం బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని పేర్కొన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు.

దివ్యాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ

రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన పూస బాలకిషన్ యువసేన సభ్యులు సోమవారం టేకుల సోమారంలోని సాధన దివ్యాంగుల ఆశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశం విజయం సాధించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, సాయి, బాలకృష్ణ, నరేష్, సందీప్, శివ పాల్గొన్నారు.

గ్యారంటీలను ఆదరించారు



ఎగ్గిడి శ్రీశైలం

ఆలేరు: ఆలేరు ఎమ్మెల్యేగా బీర్ల ఐలయ్య విజయం అన్ని వర్గాలదని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎగ్గిడి శ్రీశైలం అన్నారు. సోమవారం ఆయన ఆలేరులో విలేకరులతోతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలు ఆదరించారన్నారు. ఆలేరు అభివృద్ధి కోసం ప్రజలు మార్పు కోరుకున్నారని చెప్పారు. బడుగు బలహీనవర్గాల అభ్యర్థిగా గుర్తించి అన్ని వర్గాల ప్రజలు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలపించారన్నారు. ఐలయ్య విజయం కోసం పనిచేసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు ఎగ్గడి శ్రీశైలం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నేడు సర్వసభ్య సమావేశం

చౌటుప్పల్: చౌటుప్పల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సందీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10:30గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

రాజాపేట మాజీ సర్పంచ్ బాలయ్య మృతి



బాలయ్య (ఫైల్)

రాజాపేట: మండల కేంద్రానికి చెందిన మాజీ సర్పంచ్ బిల్లకుదురు బాలయ్య (71) అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బాలయ్య 1998 నుంచి 2001 వరకు సర్పంచ్‌గా కొనసాగారు. బాలయ్యకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కాగా బా లయ్య కొద్దిరోజులుగా అనారోగ్యానికి గురి కావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా బాలయ్య మృతిపట్ల ఆయా పార్టీల నాయకులు తమ సంతాపాన్ని తెలియజేశారు.

శబరియాత్రకు తరలిన మాలధారులు



శబరికి బయలుదేరి వెళ్తున్న భక్తులు

భూదాన్‌పోచంపల్లి: పట్టణ కేంద్రంలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం గురుస్వామి గుండు శ్రీరాములు ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిహోమం, స్వామి వారికి సర్వాభిషేకాలు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం అయ్యప్ప భక్తులు ఇరుముడి ధరించి శబరియాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో పోచంపల్లి అర్బన్‌బ్యాంకు వైస్‌చైర్మన్ సూరెపల్లి రమేశ్, పాలాది యాదగిరి, గుండు ఉప్పలయ్య, మంగళపల్లి రమేశ్, సుంకి భాస్కర్, సాయికుమార్, సూరెపల్లి భూషణ్, గంజి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరు 16వ ఎమ్మెల్యేగా ఐలయ్య

- నియోజకవర్గానికి మొదటి ఎమ్మెల్యే ఆరుట్ల కమలాదేవి
- ఐదుసార్లు గెలిచి రికార్డు సృష్టించిన మోత్కుపల్లి నర్సింహులు
- ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక తొలి ఎమ్మెల్యే గొంగిడి సునీత



బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట: ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి 16వ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి బీర్ల ఐలయ్య ఎన్నికయ్యారు. 1952లో అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటు జరిగిన ఆలేరుకు 1957లో తొలిసారి ఎమ్మెల్యే ఎన్నికలు జరిగాయి. ఆలేరు అసెంబ్లీ నుంచి తొలి మహిళా ఎమ్మెల్యేగా తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఆరుట్ల కమలాదేవి గెలుపొందగా.. రెండవ మహిళా ఎమ్మెల్యేగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు జరిగాక గొంగిడి సునిత గెలుపొందారు.

ఆలేరుకు ఎమ్మెల్యేలు వీరే..

ఆలేరు నియోజకవర్గం ఏర్పడిన నాటినుంచి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకు 16మంది ఎమ్మెల్యేలుగా గెలుపొంది శాసన సభలో అడుగు పెట్టారు. మొదటగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనరల్ స్థానం నుంచి 1957, 1962లో ఆరుట్ల కమలాదేవి పీడీఎఫ్ నుంచి ఒక్కసారి, సీపీఐ నుంచి మరోసారి గెలుపొందారు. 1967, 1972లో కాంగ్రెస్ నుంచి అన్‌రెడ్డి పున్నారెడ్డి గెలిచారు. ఆ తరువాత మారిన ఎస్సీ స్థానం నుంచి 1978లో చల్లూరు పోచయ్య, 1983, 1985లో టీడీపీ నుంచి, 1989లో ఇండిపెండెంట్‌గా, 1994 టీడీపీ, 1999లో కాంగ్రెస్ నుంచి వరుసగా ఐదుసార్లు మోత్కుపల్లి నర్సింహులు గెలిచి రికార్డు సృష్టించారు. 2004 ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) నుంచి కుడుదుల నగేష్ గెలుపొందారు. ఆ తరువాత జరిగిన పరిణామాలతో, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంతో కుడుదుల నగేష్ 2008లో ఎమ్మెల్యే పదవీకి రాజీనామా చేసి తిరిగి ఆయనే గెలుపొందారు. 2009లో మారిన జనరల్ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బూడిద భిక్షమయ్యగౌడ్ గెలిచారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిన తరువాత జరిగిన 2014, 2018 ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ (ప్రస్తుతం బీఆర్ఎస్) నుంచి గొంగిడి సునీత వరుసగా రెండుసార్లు గెలిచి సత్తాచాటారు. ప్రస్తుతం ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి బీర్ల ఐలయ్య గెలుపొంది తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు.

మూడు మండలాల నుంచి ఇద్దరేసి ఎమ్మెల్యేలు..

ఆలేరు అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆలేరు, రాజాపేట, యాదగిరిగుట్ట మండలాల నుంచి ఇద్దరేసి ఎమ్మెల్యేలు ఆరుగురు గెలిచారు. ఆలేరు మండలం కొలనుపాక నుంచి ఆరుట్ల కమలాదేవి, అదే మండలం రాఘవాపురం నుంచి కుడుదుల నగేష్, రాజాపేట మండలం రఘునాథపురం నుంచి చల్లూరు పోచయ్య, పారుపల్లి నుంచి మోత్కుపల్లి నర్సింహులు, యాదగిరిగుట్ట మండలం వంగపల్లి నుంచి గొంగిడి సునీత, సైదాపురం గ్రామం నుంచి ఇప్పుడు బీర్ల ఐలయ్యలు గెలిచారు. ఒకే మండలం నుంచి ఇద్దరేసి చొప్పున ఎమ్మెల్యేలుగా గెలిచి తమ సత్తాను చాటారు.

ప్రజా తీర్పును గౌరవిస్తా..

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: ప్రజా తీర్పును గౌరవించి ప్రతిపక్ష పాత్ర పక్కాగా పోషిస్తానని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం భువనగిరి బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి ప్రజలు రెండుసార్లు ఇచ్చిన అవకాశంతో పదేళ్లు రాత్రింబవళ్లు అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేశానని చెప్పారు. ప్రతిఒక్కరికీ అండగా నిలిచి ఆదుకున్నానన్నారు. నేను నాన్ లోకల్ అని ఎన్నికల్లో ప్రచారం చేసి ప్రజలు నాకు ఓటు వేయవద్దని తీసుకున్న నిర్ణయం బాధ కలిగిస్తోందన్నారు. త్రిపుల్ ఆర్ ఆలైన్‌మెంట్ విషయంలో నాకు ఎలాంటి సంబంధం లేదని దేవుని వద్ద ప్రమాణం చేస్తానని పలుమార్లు చెప్పానన్నారు. అలైన్‌మెంట్ చేయడం సెంట్రల్ గవ్నమెంట్ నిర్ణయమని చెప్పినా ఎవరూ నమ్మలేదన్నారు. ప్రతిపక్షాలు అబాండాలు వేసి నన్ను దోషిగా చూపించి ఎన్నికల్లో లబ్ధిపొందాయన్నారు. ఈ ఎన్నికల్లో దళిత సోదరులు, మరికొన్ని వర్గాలు బీఆర్ఎస్‌ను విశ్వసించలేదని దాన్ని కాంగ్రెస్ వినియోగించుకుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉన్నానన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ కొలుపుల అమరేందర్, మున్సి పల్ చైర్మన్ ఆంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, నాయకులు గాదె నరేందర్‌రెడ్డి, ఎడ్ల సత్తిరెడ్డి, చింతల కిష్టయ్య, ఏవీ కిరణ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చెయ్యెత్తి జైకొట్టిన రామన్నపేట

- గ్రామగ్రామాన కాంగ్రెస్‌కే ఆధిక్యం
- మండల వ్యాప్తంగా 10,987 మెజార్టీ



రామన్నపేట: విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కాంగ్రెస్ కార్యకర్తలు

రామన్నపేట: ఈ ఎన్నికల్లో రామన్నపేట మండల ఓటర్లు కాంగ్రెస్‌పార్టీకి జైకొట్టారు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో మండల వ్యాప్తంగా 10,987 మెజార్టీ కట్టబెట్టారు. 59బూత్‌లకు గాను కేవలం వెల్లంకి గ్రామంలోని 10వ బూత్‌లో మాత్రమే బీఆర్ఎస్‌కు మూడు ఓట్లు ఎక్కువ వచ్చాయి. మిగిలిన అన్ని బూత్‌లలో కాంగ్రెస్ ఆధిక్యత కొనసాగింది. మండలంలో మొత్తం 44,183మంది ఓటర్లు ఉండగా 37, 929మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వేముల వీరేశంకు 22,227ఓట్లు లభించగా బీఆర్ఎస్ అభ్యర్థి చిరుమర్తి లింగయ్య 11,238ఓట్లు సాధించారు. బీజేపీ అభ్యర్థి నకిరేకంటి మొగులయ్యకు 1,310, సీపీఎం అభ్యర్థి బొజ్జవెంకులు 1,117, బీఎస్పీ అభ్యర్థి మేడి ప్రియదర్శినికి 467ఓట్లు లభించాయి.

కొబ్బరికాయలు కొట్టి మొక్కు చెల్లించి..



ఆత్మకూరు(ఎం)లో మొక్కు తీర్చుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు



యాదగిరిగుట్ట రూరల్: దాతర్‌పల్లిలో మొక్కు చెల్లించుకుంటున్న నాయకులు

ఆత్మకూరు(ఎం), యాదగిరిగుట్ట రూరల్: ఆలేరు ఎమ్మెల్యేగా బీర్ల అయిలయ్య గెలుపును హర్షిస్తూ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు సోమవారం మండల కేంద్రంలోని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బొడ్రాయి వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే ఆత్మకూర్(ఎం)తో పాటు పల్లెర్ల, సింగారం, రాయిపల్లి, కొరటికల్, మొరిపిరాల, రహీంఖాన్‌పేట, కప్రాయపల్లి, పోతిరెడ్డిపల్లి కూరెళ్లర గ్రామాల్లోనూ సంబరాలను జరుపుకున్నారు. అదేవిధంగా యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఆ పార్టీ నాయకులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీర్ల అయిలయ్య గెలిస్తే 101 కొబ్బరికాయలు కొడుతామని ఎన్నికలకు ముందు మొక్కుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఆత్మకూర్ఎం మండల అధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఎంపీపీ తండ మంగమ్మ, జెడ్పీటీసీ కొడిత్యాల నరేందర్ గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి కందడి అనంతరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జన్నాయికోడె నగేష్, పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర రెడ్డి, అలాగే యాదగిరిగుట్ట మండలం దాతర్‌పల్లి గ్రామంలో ఉపసర్పంచ్ భాస్కర్, నాయకులు అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కోమటిరెడ్డి విజయాన్ని హర్షిస్తూ..



చౌటుప్పల్‌లో కేక్ కట్ చేస్తున్న న్యాయవాదులు

చౌటుప్పల్: మునుగోడు ఎమ్మెల్యేగా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం చౌటుప్పల్‌లో బార్ అసోసియషన్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకున్నారు. యూత్ కాంగ్రెస్ లీగల్ సెల్ జిల్లా కోఆర్డినేటర్ మక్తాల నర్సింహ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి నర్సింహారెడ్డి, ముత్యాల సత్తిరెడ్డి, పాల పరమేష్, ఎస్ఆర్.భిక్షపతి, పిట్ట భిక్షమయ్య, మంచాల శంకర్, నర్సింహ, శ్రీనివాస్, సత్యనారాయణ, నాగరాజు, సత్యం, శంకరయ్య ఉన్నారు.

రామాలయంలో పూజలు

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రివర్గంలో మంచి స్థానం కల్పించాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పట్టణ కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 కొబ్బరికాయలు కొట్టారు. స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, కౌన్సిలర్లు ఉబ్బు వరమ్మవెంకటయ్య, అంతటి విజయలక్ష్మీబాలరాజు, కాసర్ల మంజుల శ్రీనివాస్‌రెడ్డి, కొయ్యడ సైదులు, సందగళ్ల విజయ సతీష్, కామిశెట్టి శైలజభాస్కర్, నాయకులు బొబ్బిళ్ల మురళి, మొగుదాల రమేష్ ఉన్నారు.

నారాయణపురంలో కాంగ్రెస్‌కే మెజార్టీ

సంస్థాన్ నారాయణపురం: కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సంస్థాన్ నారాయణపురం మండలంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కంటే 5,653 ఓట్ల మెజార్టీ వచ్చింది. రాజగోపాల్‌రెడ్డి 17,015, బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి 11,362, బీజేపీ అభ్యర్థి చల్లమల్ల కృష్ణారెడ్డి 5,006 ఓట్లు వచ్చాయి.

ఆత్మకూరు(ఎం)లో ఐలయ్యకే ఆధిక్యం

ఆత్మకూరు(ఎం): ఆలేరు ఎమ్మెల్యేగా గెలుపొందిన కాంగ్రెస్ అభ్యర్థి బీర్ల ఐలయ్యకు ఆత్మకూరు(ఎం)మండలం జైకొట్టింది. మండలంలో 23 గ్రామాలు ఉండగా ఒక్క మోదుబావిగూడెం మినహా మిగతా అన్ని గ్రామాలు అండగా నిలిచాయి. ఆదివారం జరిగిన ఓట్ల లెక్కింపులో బీర్ల ఐలయ్య.. బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీతపై 4,566ఓట్ల మెజారిటీ సాధించారు. కాగా ఒక్క మోదుబావిగూడెంలో బీర్ల అయిలయ్యకు 128ఓట్లు రాగా, గొంగిడి సునీతకు 149ఓట్లు వచ్చి 21ఓట్ల మెజార్టీ సాధించారు. మిగతా గ్రామాలైన ఆత్మకూరు (ఎం)లో 829, తిమ్మాపురంలో 152, సర్వేపల్లిలో 126, రాయిపల్లిలో 159, సారగండ్లగూడెంలో 9, పారుపల్లిలో 145, పల్లెపహాడ్‌లో 192, మొరిపిరాలలో 161, మోదుగుకుంటలో 31, కాల్వపల్లిలో 12, సింగారంలో 15, కొరటికల్‌లో 372, పల్లెర్లలో 794, లింగరాజుపల్లిలో 80, తుక్కాపురం 58, రహీంఖాన్‌పేటలో 311, పోత్తిరెడ్డిపల్లిలో 74, కప్రాయపల్లిలో 345, టి.రేపాకలో 93, ఉప్పలపహాడ్‌లో 109, కూరెళ్లలో 226, పుల్లాయిగూడెంలో 95, రాఘవాపురం 178 ఓట్ల చొప్పు సునీతపై ఐలయ్య మెజార్టీ సాధించారు.

ఆలేరు మండలంలో కాంగ్రెస్‌కు మెజార్టీ

ఆలేరు రూరల్: కాంగ్రెస్ పార్టీ ఆలేరు అభ్యర్థి బీర్ల ఐలయ్యకు ఆలేరు మండల ప్రజలు అత్యధిక మెజార్టీ ఇచ్చారు. మండలంలోని 14 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి 7,005 ఓట్లు రాగా, ప్రత్యర్థి అభ్యర్థి గొంగిడి సునీతకు 3,253 ఓట్లు వచ్చాయి. టంగుటూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి 946 అత్యధిక మెజార్టీ దక్కింది. మొత్తంగా కాంగ్రెస్ 3,253 లీడ్ మెజార్టీ వచ్చింది. అలాగే ఆలేరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీర్ల ఐలయ్యకు 5,958 ఓట్లు పడ్డాయి. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గొంగిడి సునీతకు 2,527 ఓట్లు వచ్చాయి. ఆలేరు మండల పరిధి, మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీకి మొత్తం 12,963 ఓట్లు వచ్చాయి. బీఆర్ఎస్ పార్టీకి 5,780 ఓట్లు ఇచ్చారు. ఐలయ్య 7,183 ఓట్ల మెజార్టీ సాధించారు. ఆలేరు మండలంలోని 84 మంది నోటాకు ఓటు వేశారు.

భువనగిరి నియోజకవర్గంలో పోలైన ఓట్లు

భువనగిరి: భువనగిరి నియోజకవర్గ వ్యాప్తంగా 1,96,077 ఓట్ల పోలయ్యాయి. వీటి లెక్కింపునకు 21 టేబుల్స్‌ను ఏర్పాటు చేశారు. వీటిని 19 రౌండ్ల వారీగా లెక్కించారు. ప్రతి రౌండ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ అధ్యికతను కనబర్చింది. ఏ ఒక్క రౌండ్ లోనూ బీఆర్ఎస్‌కు అధిక్యత రాలేదు.

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్ల వివరాలు

రౌండ్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ	లీడ్ (కాంగ్రెస్)
1	5,809	4,865	553	944
2.	5,510	4,547	343	963
3.	6,008	4,516	351	1,492
4.	4,511	4,038	510	473
5.	5,303	4,308	826	995
6.	4,524	3,926	772	598
7.	5,255	3,189	1,096	2,066
8.	5,824	4,631	955	1,193
9.	5,724	3,980	335	1,744
10.	6,187	4,467	449	1,720
11.	6,078	4,569	475	1,509
12.	5,769	5,291	537	478
13.	5,383	4,321	369	1,062
14.	5,416	4,791	276	625
15.	5,847	4,063	256	1,784
16.	4,581	3,302	344	1,279
17.	5,981	3,374	313	2,607
18.	5,877	3,228	303	2,649
19.	2,485	903	61	1,582
బ్యాలెట్	672	231	76	441
మొత్తం	1,02,744	76,542	9,200	26,202

పోచంపల్లిలో కాంగ్రెస్ హవా

భూదాన్‌పోచంపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మున్సిపాలిటీతో పాటు గ్రామాల్లో సైతం మెజార్టీ సాధించింది. మండల వ్యాప్తంగా మొత్తం 42,851 ఓట్లకు గాను 39,729 ఓట్లు పోలయ్యాయి. కాగా పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పోచంపల్లి, ముక్తాపూర్, రేవనపల్లిలో కలుపుకొని కాంగ్రెస్‌పార్టీకి 7081 ఓట్లు, బీఆర్ఎస్ పార్టీకి 5,740 ఓట్లు వచ్చాయి. దాంతో మున్సిపాలిటీ కాంగ్రెస్ అభ్యర్థి కుంభం సమీప బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డిపై 1,341 ఓట్ల మెజార్టీ సాధించారు. అలాగే 22 గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి 12,967 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 11,152 ఓట్లు వచ్చాయి. ఇక్కడ సైతం కాంగ్రెస్‌కు 1,815 ఓట్ల మెజారిటీ సాధించారు. మొత్తానికి మున్సిపాలిటీ, గ్రామీణం కలుపుకొని కుంభం 3,156 ఓట్ల మెజార్టీ వచ్చింది. సాయినగర్, ఇంద్రియాల, గౌస్‌కొండ, పిలాయపల్లి, దోతిగూడెం, ధర్మారెడ్డిపల్లి గ్రామాలు మినహా మిగతా అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ సాధించింది.

జిల్లా స్థాయి జూడో పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు మెమొంటోలు అందజేస్తున్న ఎస్ఐ

వలిగొండ: జిల్లా స్థాయి జూడో పోటీల్లో వలిగొండ విద్యార్థుల ప్రతిభ కనబర్చినట్లు జూడోఅసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ భువనగిరి ముత్యాలు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోత్కూర్లో నిర్వహించిన జిల్లా స్థాయి జూడో పోటీల్లో వలిగొండకు చెందిన విద్యార్థులు ఎండీ.జునైద్, మెర్సి అజిత్కుమార్, ధన్‌రాజ్, విగ్నేష్, అల్తాఫ్, వర్షిత్ పలు మెడల్స్ సాధించారని పేర్కొన్నారు. జూడో పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులకు ఎస్ఐ ప్రభాకర్ ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దత్తప్పగూడెంలో విజయోత్సవం



సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మోత్కూరు: తుంగతుర్తి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ గెలుపొందడం పట్ల సోమవారం మండలంలోని దత్తప్పగూడెం గ్రామంలో ఆ పార్టీ విజయోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల యాదగిరిరెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, అడ్వకేట్ పరైపాటి యుగేంధర్, రామచంద్రు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ఆటో కార్మికులు



కేకేసీలో చేరిక సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ఆటో కార్మిక సంఘాల సంబరాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణానికి చెందిన ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ, ఆది జాంబవ ఆటో కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ సమీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అసంఘటి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గుండు నర్సింహ గౌడ్‌తోపాటు నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం కార్మిక కర్షక కాంగ్రెస్ (కేకేసీ)లో చేరారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులు మాట్లాడుతూ యాదాద్రి కొండపైకి ఆటోలను నడిపే విధంగా కృషి చేస్తానని చెప్పిన బీర్ల ఐలయ్య హామీతో తామంతా కేకేసీలో చేరినట్లు వెల్లడించారు. అనంతరం కాంగ్రెస్ విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కేకేసీలో చేరిన వారిలో ఆటో కార్మికులు గడ్డమీది దేవందర్‌గౌడ్, బాకీ మొగులయ్య, మన్సూర్ పాషా, గుండ్లపల్లి బంగారి, కె.బాలరాజు, ఆవుల సత్యనారాయణ, డ్రైవర్లు చేరారు.

ఆర్థికసాయం అందజేత



నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట: కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు గురుకు శివ తల్లి అండాలు ఆదివారం రాత్రి మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ జినుకుల వసంతా ప్రభాకర్ తోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. నివాళులర్పించిన వారిలో ఎంపీటీసీ ఎండీ రెహాన్, నాయకులు గోదాసు పృథ్వీరాజ్, ఎండీ జమీరొద్దీన్, ఎండీ అక్రం, సాల్వేరు లింగం, గోదాసు భాస్కర్, లెంకల ప్రవీణ్, కొమ్ము శేఖర్, గొలుసుల ప్రసాద్, ఎండీ ఖరీం, పల్లపు రవి, మహబూబ్‌అలీ, గోదాసు శ్రీను, బట్టె సంతోష్, తెల్ల శేఖర్, ఉదయ్ పాల్గొన్నారు.

శివాలయాల్లో భక్తులకు అన్నదానం



భువనగిరి : పచ్చలకట్టసోమేశ్వరాలయంలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



చౌటుప్పల్ : భోజనం వడ్డిస్తున్న వైద్యులు

భువనగిరి: కార్తీక మాసం సందర్భంగా సోమవారం భువనగిరి పట్టణంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ పచ్చలకట్ట సోమేశ్వరాలయ, శ్రీభవానీ రామలింగేశ్వరాలయంలో ఉదయం అన్నదానం నిర్వహించారు. అనిల్‌కుమార్‌రెడ్డి గెలుపొందిన సందర్భంగా ఖిలానగర్‌లో శివాలయం వద్ద డాకూరి ప్రకాష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయాల నిర్వాహకులు లక్ష్మణ్, సహదేవ్, శరత్ సభ్యులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో అయ్యప్ప మాలధారులకు..

చౌటుప్పల్: పట్టణ కేంద్రంలోని శ్రీసత్యదేవ సహిత అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం డాక్టర్ సుమన్‌కళ్యాణ్ అయ్యప్ప మాలధారులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కామిశెట్టి భాస్కర్, బొబ్బిళ్ల మురళి, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, తూర్పాటి శంకర్, దాచేపల్లి ప్రకాష్ ఉన్నారు.

చెర్వుగట్టులో కార్తీక పూజలు

నార్కట్‌పల్లి: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా మండలంలోని చెర్వుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు, అభిషేకలు, సత్యనారాయణ స్వామి వత్రాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. దేవాలయం ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ, సురేష్ శర్మ, శ్రీకాంత్ శర్మ, సతీష్‌శర్మ, సిద్ధాంత శర్మ, నాగయ్య శర్మ, జగదీష్‌శర్మ, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టుపైన భక్తులకు ఇబ్బందులు కలుగకుండా వాహనాలను పైకి అనుమతించలేదు.

టార్పాలిన్లు అందించరూ..!

- వర్షమొస్తే తడుస్తున్న ధాన్యం
- ఐదేళ్లుగా నిలిచిన టార్పాలిన్ల పంపిణీ
- రైతులకు తప్పని ఇబ్బందులు
- పథకాన్ని పునరద్ధరించాలని వేడుకోలు



అడ్డగూడూరులో ధాన్యంపై కప్పిన బస్తా పట్టాలు

అడ్డగూడూరు: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కప్పేందుకు టార్పాలిన్లు లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఐదేళ్ల క్రితం వరకు రైతులకు టార్పాలిన్లు సరఫరా చేసింది. దీంతో అన్నదాతలు కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంతోపాటు తమ సొంత కల్లాల్లో ఆరబోసుకున్న ధాన్యంపై వర్షం సమయంలో కప్పుకునేవారు. అయితే ఐదేళ్ల నుంచి ప్రభుత్వం టార్పాలిన్లు పంపిణీ చేయడమే మరిచిపోయింది.

అధిక ధరకు కొనుగోలు..

అడ్డగూడూరు మండల వ్యాప్తంగా దాదాపు 10 వేల మంది రైతులు ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి 11,345 ఎకరాల్లో వరిసాగు చేశారు. వీరంతా ప్రతిఏటా టార్పాలిన్లు కోసం ఎదురుచూస్తున్నారు. కాగా ప్రభుత్వం గతంలో 50 శాతం సబ్సిడీ టార్పాలిన్లు పంపిణీ చేసేది కానీ 2019 నుంచి పంపిణీని నిలిపివేసింది. దీంతో రైతులు రూ.3వేలపైగా అధిక ధర చెల్లించి బహిరంగ మార్కెట్‌లో టార్పాలిన్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వర్షమొచ్చినప్పుడు రైతులు తమ ధాన్యం తడవకుండా కప్పుకునేందుకు గతంలో మాదిరిగా సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వమే నిలిపివేసింది



“గతంలో సబ్సిడీ ద్వారా అందించిన టార్పాలిన్ల పంపిణీని ప్రభుత్వమే 2019 నుంచి నిలిపివేసింది. దీంతో రైతులకు టార్పాలిన్లు అందించలేకపోతున్నాం. ప్రభుత్వం తిరిగి పంపిణీని ప్రారంభిస్తే రైతులకు మళ్లీ అందజేస్తాం.

– అరుణకుమారి, ఏఓ, అడ్డగూడూరు

టార్పాలిన్లు పంపిణీ చేయాలి



“ఐదేళ్ల నుంచి టార్పాలిన్ల పంపిణీ చేయడంలేదు. అకాల వర్షాలప్పుడు ధాన్యం తడిసిపోతుంది. బయట దుకాణాల్లో టార్పాలిన్ల కొనాలంటే ఒక్కోదానికి రూ.3వేలకు పైగానే చెల్లించాల్సి వస్తోంది. ప్రభుత్వమే అందజేయాలి.

– తుప్పతి మధు, రైతు, అడ్డగూడూరు